పీఈటీల సమస్యలను పరిష్కరించాలి

గన్‌ఫౌండ్రీ: వ్యాయామ విద్య ఉపాధ్యాయుల పదోన్నతులు, న్యాయ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ సంఘం కోరింది. శుక్రవారం ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ రాష్ట్ర నాయకులు రాఘవరెడ్డి, కృష్ణమూర్తి గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..14 ఏళ్లుగా ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పీఈటీలకు పదోన్నతులు లేవని తెలిపారు. అదేవిధంగా పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌గా అప్‌గ్రేడ్ చేశారని ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉందన్నారు. రాబోయే మెగా డీఎస్సీలో 1500 పీఈటీ


రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా పీఈటీల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడంతో పాటు పీటీలకు త్వరలోనే పదోన్నతులు కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వ్యవసాయ శాఖ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

గన్‌ఫౌండ్రీ: వ్యవసాయ శాఖలో ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను త్వరితగతిన కల్పించాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ వి.కృపాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వ్యవసాయ శాఖ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ..2016 జిల్లాల పునర్‌విభజన తర్వాత ఆయా జిల్లాలకు వ్యవసాయ శాఖలో జిల్లా, మండల స్థాయి పోస్టులను ఏర్పాటు చేయలేదని తెలిపారు. తమ సమస్యల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, నల్లగొండ జిల్లా యూనిట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నియామకం


నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగం జాయింట్ కో ఆర్డినేటర్‌గా గోషామహల్ నియోజకవర్గానికి చెందిన నిర్మల్‌కుమార్‌యాదవ్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..35 ఏళ్లుగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్న తనకు జాతీయ స్థాయిలో పదవి లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు పదవి అప్పగించిన కేసీ.వేణుగోపాల్, ఓబీసీ సెల్ చైర్మన్ అజయ్‌సింగ్ యాదవ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌బీఐ దాతృత్వం

సాక్షి, సిటీబ్యూరో: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మేడ్చల్‌లోని గూడవెల్లిలోని కృషి హోమ్ అనాథాశ్రమానికి టాటా వింగర్ స్కూల్ బస్సు, ఓపెన్ జిమ్ పరికరాలను విరాళంగా అందించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వినయ్ ఎం టోన్సే హైదరాబాద్‌ను సందర్శించిన సందర్భంగా సీఎస్‌ఆర్ నిధులతో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సైనిక్ స్కూల్ కోరుకొండ పూర్వ విద్యార్థులచే ఏర్పాటు చేసిన 'సాయికోరియన్'సంయుక్త సహకారాన్ని అందించింది. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ వినయ్ ఎం టోన్సే టాటా వింగర్ స్కూల్ బస్సు తాళంచెవిని సాయికోరియన్ అధ్యక్షుడు భాస్కర్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా టోన్సే మాట్లాడుతూ..ఎప్పటికప్పుడు సామాజికి అభివృద్ధికి ఎస్‌బీఐ తోడ్పాటును అందిస్తుందన్నారు.

ముగిసిన బెంగాలీల సరస్వతి పూజలు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం బెంగాలీ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సరస్వతి పూజలు శుక్రవారంతో ముగిశాయి. ఈనెల 14న, బెంగాలీలు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



భక్తిశ్రద్ధలతో హజ్రత్ ఇమాం హుస్సేన్ జయంత్యుత్సవాలు



చార్మినార్: అంజుమన్–ఇ–అల్ అబ్బాస్ ఆధ్వర్యంలో శుక్రవారం దారుషిఫాలో హజ్రత్ ఇమాం హుస్సేన్ 1442 జయంత్యుత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీకి ఉత్సవాల నిర్వాహకులు మెమొంటో అందజేసి సత్కరించారు. మౌలానా అలీ హైదర్ ఫరిస్తా, మౌలానా హసనన్ రజ్వీ, అక్తర్ నవాబ్ పాల్గొన్నారు.

10 నెలల పెండింగ్ ఉపకార వేతనాలు చెల్లించాలి

సుల్తాన్‌బజార్: పది నెలలుగా ఉపకార వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని టీవీవీపీ పీజీ వైద్య విద్యార్థులు టీవీవీపీ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం కోఠి డీఎంఈ ఆవరణలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌ను వారు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ..2020లో నేషనల్ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ పక్షాన డిప్లొమాటిక్ నేషనల్ బోర్డు ఆధ్వర్యంలో 46 మందిని సంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకు పీజీ వైద్య విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. 2023


టీవీవీపీ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న టీవీవీపీ పీజీ వైద్య విద్యార్థులు

వరకు ఉపకార వేతనాలు అందించినప్పటికి గత ఏడాది ఏప్రిల్ నుంచి సుమారు 10 నెలలుగా ఉపకార వేతనాలు అందజేయడం లేదని వారు ఆరోపించారు. ఈ విషయమై తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌ను, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా తమ సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు.

నేడు సైంటియా సైన్స్ ఎక్స్‌పో

గోల్కొండ: విద్యార్థుల మేధకు పదునుపెట్టేందుకు వారికి ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రవీంద్రభారతీ పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియమనీష్ అన్నారు. శుక్రవారం టోలిచౌకీ సూర్యనగర్ కాలనీలోని రవీంద్రభారతీ పాఠశాలలో ఆమె మాట్లాడుతూ.. నేడు పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సైంటియా సైన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక తరగతుల విద్యార్థుల కోసం సైంటియా సైన్స్ ఎక్స్‌పో విద్యార్థుల మేధకు ఒక వేదికలాంటిదని ఆమె అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సైన్స్ ఎక్స్‌పో ఉంటుందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు భౌగోళిక, ఖగోళ, శాస్త్ర సంబంధమైన ఎన్నో అద్భుత ప్రదర్శనలు ఈ సైన్స్ ఎక్స్‌పోలో ఉంటాయని ఆమె తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్

అబిడ్స్: కార్మికులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసేంత వరకు ఆందోళన కొనసాగుతుందని ఇండియన్ నేషనల్ మున్సిపల్ జనరల్ సెక్రెటరీ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ నారాయణగూడ నుంచి ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ..సీపీఎస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ కార్మికులకు కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, విజయ్‌కుమార్‌యాదవ్, నాగన్నగౌడ్, ఉమేష్ బాబు, రఫీక్, సయ్యద్ ఇస్లామూద్దీన్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

నాంపల్లి: కొత్తగా ఏర్పడిన నూతన ప్రభుత్వంలో నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సర్వే ల్యాండ్ శాఖ కేలండర్ ఆవిష్కరణ సభ జరిగింది. సర్వే ల్యాండ్స్ జేడీ ఎ.భాస్కర్, డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ రాముతో కలిసి తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ కేలండర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, కార్యదర్శి అతీక్ పాషా, సర్వే ల్యాండ్స్ శాఖ యూనిట్ అధ్యక్షుడు బి.నాగరాజు, కార్యదర్శి ఎం.ఎ.కరీం, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కోశాధికారి జలపతిరావు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీమ్‌లో దాదాపు 17 వేల మంది కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతిన వివిధ విభాగాల్లో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న వీరిని పర్మనెంట్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.నర్సింహ, రామరాజేష్ కన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కోఠిలోని కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులందరినీ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో పనిచేస్తున్న వైద్యులను ఏమాదిరిగా రెగ్యులరైజ్ చేశారో అదే మాదిరిగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమాణ్యం, రాజేశ్వరీ రెడ్డి, దుర్గ, స్వప్న, సురేష్ గౌడ్, మధు, హన్మంతు, శిరీష, మానెమ్మ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

అబిడ్స్: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర రాష్ట్ర ఉద్యోగుల పట్ల మొండి వైఖరిని అవలంభిస్తూ ప్రైవేటీకరణకు మొగ్గు చూపుతున్నారన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలకు నిరసనగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ఆదేశాల మేరకు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో నగరంలోని పలు శాఖల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ముజీబ్ హుస్సేని



మాట్లాడుతూ..ఇన్‌కమ్ ట్యాక్స్ వయోపరిమితిని రూ.10 లక్షలకు పెంచాలన్నారు. కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, కస్తూ వెంకట్, శ్రీనివాస్, శైలజ, విక్రమ్‌కుమార్, కేఆర్.రాజ్‌కుమార్, ఉమార్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్‌కుమార్, శ్రీధర్ నాయుడు పాల్గొన్నారు.

బీసీ కులగణన తీర్మానంపై హర్షం


వెంకటేశ్

గౌలిపురా: రాష్ట్రంలో బీసీ కులగణనతో పాటు సమగ్ర కుటుంబ సర్వేలపై అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం సాహసోపేతమైన నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. కులగణన చేపడితే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని..ప్రభుత్వం సంక్షేమ పథకాలు అర్హులకు అందుతాయన్నారు. కులగణన చేపట్టడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలలోని నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసి చట్టబద్ధత తీసుకురావాలన్న నిర్ణయం రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేయగలిగే శక్తి తమకే ఉందని కాంగ్రెస్ పార్టీ నిరూపించుకుందన్నారు. అసెంబ్లీలో కులగణన తీర్మానం ప్రవేశపెట్టిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రొన్నం ప్రభాకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వెంకటేశ్ ధన్యవాదాలు తెలిపారు.

అయోధ్యలో అన్నదానానికి సరుకుల పంపిణీ



అఫ్జల్‌గంజ్: అయోధ్యలోని రామమందిరం సందర్శనకు వచ్చే రామభక్తులకు భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని ఆల్ ఇండియా మట్ మందిర్ అధ్యక్షుడు ఎం. రామరాజు, ఇన్‌కం టాక్స్ కమిషనర్ బి.బాలరాజు, వీహెచ్‌పీ తెలంగాణ జాయింట్ కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్, విరించి ఆస్పత్రి చైర్‌పర్సన్, లతమ్మ ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత అన్నారు. శుక్రవారం ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ ప్రధాన కార్యాలయం నుంచి అయోధ్యకు నిత్యావసరాల సరుకులతో కూడిన లారీని జెండా ఊపి ప్రారంభించారు.

కెనడాలో నగర విద్యార్థి మృతి


షేక్ ముజామిల్ అహ్మద్ (ఫైల్)

గోల్కొండ: హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి కెనడాలో మృతి చెందాడు. టోలిచౌకీ బాల్‌రెడ్డినగర్‌కు చెందిన షేక్ ముజాఫర్ అహ్మద్ కుమారుడు షేక్ ముజామిల్ అహ్మద్(25). ఐటీలో మాస్టర్స్ డిగ్రీ చేయడానికి 2022లో కెనడా వెళ్లాడు. ఒంటారియో సిటీ కిచెన్నర్‌లోని కనెస్టోగా కాలేజీలో ఎంఎస్‌ఐటీ డిగ్రీ చేస్తున్నాడు. వాటర్లు క్యాంపస్‌లో ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా షేక్ ముజామిల్ అహ్మద్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నాడు. కార్డియాక్ అరెస్టుతో శుక్రవారం ఉదయం మృతి చెందాడు.

ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి తండ్రి ముజాఫర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

షేక్ ముజామిల్ అహ్మద్ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. బాల్‌రెడ్డినగర్‌లో నివసించే మృతుడి తండ్రి షేక్ ముజాఫర్ అహ్మద్‌ను ఆయన మృతుడి కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకువెళ్లి మృతదేహాన్ని ఇండియాకు రప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే షేక్ ముజాఫర్‌కు హామీ ఇచ్చారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.